

మంగపేట:ధాన్యం రాశులపై టార్పాలిన్ షీట్లు కప్పుతున్న రైతులు

# రైతుల్లో మిచౌంగ్ గుబులు

- ఆందోళన కలిగిస్తున్న తుఫాన్ హెచ్చరికలు
- ఒక్కసారిగా కమ్ముకున్న మబ్బు
- కల్లాలు, రోడ్లపై ధాన్యం కుప్పలు..
- పరదాలు కప్పి అప్రమత్తం
- మిరపకు ఆకుముడత సోకే ప్రమాదం



శాయంపేట : ధాన్యం తడవకుండా కుప్పలపై కవర్లు



గోవిందరావుపేట : ధాన్యం రాశులపై పరదాలు

బంగాళాఖాతంలో ఏర్పడిన మిచౌంగ్ తుఫాన్ ప్రభావంతో రైతులు ఆందోళనకు చెందుతున్నారు. ఆదివారం ఉదయం నుంచే ఒక్కసారిగా మబ్బులు కమ్ముకోవడంతో ధాన్యం రాశులను కాపాడుకునేందుకు పరదాలు కప్పి అప్రమత్తమవుతున్నారు. ఆరబోసిన ధాన్యం ఎండకపోవడంతో వర్షం పడితే ముక్కిపోయి మొలకలెత్తే ప్రమాదముందని ఆవేదన చెందుతున్నారు. వ్యవసాయ మార్కెట్ యార్డు ఆవరణలు, ఆయా గ్రామాల్లోని కొనుగోలు కేంద్రాలు, కల్లాల్లో ఆరబోసిన ధాన్యం తడవకుండా టార్పాలిన్ కవర్లు కప్పారు. తుఫాన్ ప్రభావంతో రెండు రోజులుగా మబ్బులు కమ్ముకొని ఉండడంతో మిరప తోటలకు ఆకుముడత సోకే ప్రమాదముందని రైతులు భయపడుతున్నారు. ఓ ఇరవై రోజుల పాటు వాతావరణం అనుకూలిస్తేనే కొనుగోళ్లు సజావుగా సాగుతాయని అంటున్నారు. మరోవైపు పంట పొలాలు కోత దశలో ఉన్న రైతులు, ధాన్యం వర్షానికి రాలిపోతుందేమోనని ఆందోళన చెందుతున్నారు. అకాల వర్షంతో పత్తి రైతుల్లోనూ టెన్షన్ నెలకొంది. ఏరుతున్న పత్తి తడిస్తుందేమోనని గుబులు చెందుతున్నారు.

- ఏటూరునాగారం/ తాడ్వాయి/ మంగపేట/ గోవిందరావుపేట/ శాయంపేట, డిసెంబర్ 4







తెలంగాణ ఉద్యమంలో భాగంగా ఇప్పగూడెం గ్రామ విద్యార్థుల సమ్మెకు మద్దతుగా శిబిరంలో కూర్చున్న సంపత్‌రెడ్డి (ఫైల్)



సోమవారం మధ్యాహ్నం 12.15గంటలకు స్టేషన్‌ఘన్‌పూర్‌లోని బీఆర్ఎస్ కార్యాలయంలో ఎమ్మెల్యే కడియం శ్రీహరితో కలిసి విలేకరుల సమావేశంలో పాల్గొన్న పాగాల సంపత్‌రెడ్డి

# పాగాల అస్తమయం

**హనుమకొండలోని నివాసంలో గుండెపోటు**

**జనగామ జడ్పీ అధ్యక్షుడు సంపత్‌రెడ్డి హఠాన్మరణం**

- హాస్పిటల్‌లో తుదిశ్వాస.. ఉమ్మడి జిల్లాలో విషాదం.. బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ సంతాపం
- సంపత్‌రెడ్డి కుటుంబానికి బీఆర్ఎస్ పార్టీ అండగా ఉంటుందని భరోసా.. నివాళులర్పించిన కడియం, పల్లా
- నేడు స్వగ్రామం రాజవరంలో అంత్యక్రియలు.. హాజరుకానున్న కేటీఆర్

జనగామ, డిసెంబర్ 4(నమస్తే తెలంగాణ)/స్టేషన్‌ఘన్‌పూర్/చిల్పూరు : జనగామ జిల్లా పరిషత్ చైర్మన్, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు పాగాల సంపత్‌రెడ్డి(55) సోమవారం సాయంత్రం గుండెపోటుతో తుదిశ్వాస విడిచారు. జనగామ జిల్లా చిల్పూరు మండలం రాజవరం గ్రామానికి చెందిన సంపత్‌రెడ్డి, తెలంగాణ ఉద్యమకారుడిగా బీఆర్ఎస్‌లో ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్నారు. ఉద్యమంలో, పార్టీలో ఆయన సేవలను గుర్తించిన బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ జనగామ జడ్పీచైర్మన్‌గా, పార్టీ జిల్లా అధ్యక్షుడిగా పదవులను ఇచ్చారు. వివాదరహితుడిగా పేరుతెచ్చుకున్న సంపత్‌రెడ్డి హఠాన్మరణంతో పార్టీ శ్రేణులు, స్థానిక ప్రజాప్రతినిధులు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ శ్రేణులు, జడ్పీటీసీలు, ఎంపీపీలు ప్రగాఢ సంతాపం తెలిపి, ఆయన కుటుంబానికి సానుభూతి ప్రకటించారు. ఎమ్మెల్యేగా ఎన్నికైన కడియం శ్రీహరి గురువారం మధ్యాహ్నం స్టేషన్‌ఘన్‌పూర్‌లో తొలిసారి నిర్వహించి విలేకరుల సమావేశంలో అందరితో కలివిడిగా గడిపి, పార్టీ శ్రేణులతో సంబురాలు జరుపుకొని స్వయంగా స్వీట్లు పంచి ఉత్సాహంగా కనిపించిన సంపత్‌రెడ్డి కొద్దిసేపటికే కానరాని లోకాలకు వెళ్లడాన్ని పార్టీ శ్రేణులు జీర్ణించుకోలేకపోతున్నారు. ఎమ్మెల్యేలు కడియం శ్రీహరి, పల్లా రాజేశ్వర్‌రెడ్డి సోమవారం రాత్రి రాజవరం వెళ్లి పాగాల పార్థివదేహంపై పూలమాలలు వేసి నివాళులర్పించారు. మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు, మాజీ ఎమ్మెల్యేలు టీ రాజయ్య, ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి సంతాపం ప్రకటించి ఆయన కుటుంబానికి అండగా ఉంటామని భరోసానిచ్చారు.

### ప్రమాదంలో తనయుడు.. గుండెపోటుతో తండ్రి

జయపాల్‌రెడ్డి-సుకన్య దంపతులకు ముగ్గురు సంతానంలో సంపత్‌రెడ్డి పెద్దవాడు. 1968 డిసెంబర్ 26న జన్మించిన ఆయన ప్రాథమిక విద్యను రాజవరంలో, 8, 9తరగతులను హనుమకొండలో, 10వ తరగతి, ఇంటర్ స్టేషన్‌ఘన్‌పూర్‌లో పూర్తిచేసి హైదరాబాద్‌లో బీకాం. హనుమకొండలో ఐటీఐ పూర్తి చేశారు. 1992లో సుజాతారెడ్డితో వివాహం కాగా కుమారుడు సాయిరెడ్డి, కుమార్తె సంజనారెడ్డి జన్మించారు. సంజనారెడ్డి ప్రస్తుతం బీటెక్ చదువుతోంది. కాగా, 2010 జూన్ 26న కుమారుడు సాయిరెడ్డి రోడ్డు ప్రమాదంలో మృత్యువాత పడడంతో సంపత్‌రెడ్డి మానసికంగా కుంగిపోయాడు.

### అంతక్రియలకు హాజరుకానున్న కేటీఆర్

పాగాల అంత్యక్రియలను రాజవరంలోని వ్యవసాయం క్షేత్రంలో నేడు మధ్యాహ్నం నిర్వహించనున్నారు. కార్యక్రమానికి బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ హాజరుకానున్నారు.






'మాకొద్దు రాయల తెలంగాణ' అంటూ ఎమ్మెల్యే రాజయ్యతో కలిసి ఉద్యమంలో పాల్గొన్న సంపత్‌రెడ్డి

### బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ దిగ్భ్రాంతి..

పాగాల మృతి విషయం తెలిసి బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. సంపత్‌రెడ్డి కుటుంబాన్ని ప్రగాఢ సానుభూతి తెలిపారు. బీఆర్ఎస్ పార్టీ పరంగా అండగా ఉంటామని భరోసాన్చిరు.



### కేసీఆరే దైవంగా..

తెలంగాణ ఉద్యమ సారథి కేసీఆర్ అంటే పాగాలకు దైవంతో సమానం. ఆదివారం ఎన్నికల ఫలితాలను జనగామ పీఏసీఎస్ చైర్మన్ నిమ్మతి మహేందర్‌రెడ్డి ఇంట్లో చాలాసేపు టీవీలో చూస్తూ కేసీఆర్ ముఖ్యమంత్రి కావడం లేదని ఉద్వేగానికి గురయ్యాడని చెబుతున్నారు. తెలంగాణ సాధన కోసం కేసీఆర్ పిలుపుతో సూపర్‌వైజర్ ఉద్యోగాన్ని వదులుకొని ఉద్యమంలోకి అడుగుపెట్టిన పాగాల, ఇటుకబట్టీల వ్యాపారం చేసి వచ్చిన డబ్బుతో ఉద్యమానికి ఊతమిచ్చారు. లాఠీ దెబ్బలు తినడమే కాకుండా నిర్బంధాన్ని తట్టుకొని నిలిచాడు. ఉద్యమ సమయంలో పాగాలపై 28 కేసులు నమోదయ్యాయి. 2001లో కరీంనగర్ జైత్రయాత్ర సభలో టీఆర్ఎస్‌లో చేరిన సంపత్‌రెడ్డి 2002 నుంచి 2006 వరకు ఉమ్మడి వరంగల్ జిల్లా యువజన విభాగం ప్రచార ప్రధాన కార్యదర్శిగా, 2006 నుంచి 2013 వరకు స్టేషన్‌ఘన్‌పూర్ మండల టీఆర్ఎస్ అధ్యక్షుడిగా, 2013 నుంచి 2015 వరకు స్టేషన్‌ఘనపూర్ నియోజకవర్గ ఇన్‌ఛార్జిగా పలు పదవుల్లో పనిచేశారు. 2019 జూలై 5న చిల్పూరు మండల జడ్పీటీసీగా ఎన్నికైన సంపత్‌రెడ్డి సేవలను గుర్తించిన కేసీఆర్ ఆయనను జనగామ జిల్లా పరిషత్ చైర్మన్‌గా ఎంపిక చేశారు. ఆ తర్వాత 2022 జనవరి 26న జనగామ జిల్లా బీఆర్ఎస్ అధ్యక్షుడిగా కూడా నియమితుడయ్యారు.

ఉగ్గంపల్లిలో వడ్లను తూర్పారబడుతున్న రైతులు



# జోరుగా వరికోతలు..

**బిజీబిజీగా రైతులు, కూలీలు.. హార్వెస్టర్లకు ఫుల్ గిరాకీ**



విస్సంపల్లిలో రోడ్డుపై ఆరబోసిన వడ్లు

చిన్నగూడూరు, డిసెంబర్ 4 : వరి కోతలు జోరందుకున్నాయి. ఏ గ్రామంలో చూసినా హార్వెస్టర్‌తో కోత కోయిస్తూ, వడ్లను తూర్పార పడుతూ, మెదలను ట్రాక్టర్‌తో తొక్కించే పనులతో రైతులు, కూలీలు బిజీబిజీగా కనిపిస్తున్నారు.కొన్నిచోట్ల రైతులు స్వయంగా చేతులతో కోత పనులు చేస్తుండగా ఎక్కువ మంది యంత్రాలు వినియోగిస్తున్నారు.గిరాకీ ఎక్కువగా ఉంటుండడంతో ప్రతి గ్రామంలో హార్వెస్టర్ల సంఖ్య ఐదు నుంచి పదికి పెరిగింది. చెరువులు, కుంటల్లో నీరు పుష్కలంగా ఉండడం వల్ల రైతులు మిర్చి, పత్తి పంటలతో పాటు వరిసాగుపై రైతులు ఆసక్తిని చూపుతున్నారు. రెండు నెలల పాటు కూలీ పనులకు ఢోకా లేదని ఆయా గ్రామాల్లో వ్యవసాయ కూలీలు చెబుతున్నారు. తెల్లవారుజాము నుంచే వ్యవసాయ పనులకు వెళ్తుండడంతో ఉదయం నుంచి సాయంత్రం వరకు పంట కోసం శ్రమిస్తున్నారు.



వరి మెదలను ట్రాక్టర్‌తో తొక్కించి గడ్డి.. వడ్లను వేరు చేస్తున్న రైతులు



చిన్నగూడూరు మండలకేంద్రంలో వరి కోస్తున్న హార్వెస్టర్

# ధాన్యం దండిగా.. మార్కెట్ నిండుగా..

- కేసముద్రంలో రికార్డు స్థాయిలో 28వేల బస్తాల రాక
- రికార్డు స్థాయిలో చేతికొచ్చిన వానకాలం పంట

కేసముద్రం, డిసెంబర్ 4 : కేసముద్రం వ్యవసాయ మార్కెట్ ధాన్యంతో నిండిపోయింది. సోమవారం సుమారు 28వేల బస్తాల ధాన్యం విక్రయానికి వచ్చింది. ఈ ఏడాది వానకాలంలో వర్షాలు ఆశించిన మేర పడడం, కాళేశ్వర జలాలు చెరువులకు చేరడంతో బావులు, బోర్లలో భూగర్భ జలాలు పెరిగాయి. ఫలితంగా రైతులు వరి సాగుకు అధిక ప్రాధాన్యం ఇచ్చారు. వానకాలంలో సాగుచేసిన వరి పంట చేతికి రావడంతో రైతులు ధాన్యాన్ని విక్రయానికి తీసుకొస్తున్నారు. ఇటీవలి అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో మార్కెట్‌కు ఐదు రోజుల పాటు సెలవులు ప్రకటించారు. సోమవారం మార్కెట్ తెరుచుకోవడంతో వివిధ ప్రాంతాల 28 వేల బస్తాల తీసుకురాగా షెడ్లు అన్నీ ధాన్యంతో నిండిపోయాయి. రైతులు ఆరుబయట కూడా ధాన్యాన్ని కుప్పలుగా ఆరబోశారు. మార్కెట్‌లో సన్నరకం క్వింటాల్ గరిష్ఠ ధర రూ.3,359, కనిష్ఠ ధర రూ.2,082 పలికింది. అయితే మిచౌంగ్ తుపాన్ ప్రభావంతో వాతావరణం మార్పులు సంతరించుకున్న కారణంగా ఆరుబయట పోసిన ధాన్యానికి త్వరితగతిన కాంటాలు నిర్వహించాలని చైర్మన్ అధికారులను ఆదేశించారు. ఇప్పటికే మార్కెట్ సామర్థ్యానికి మించి ధాన్యం విక్రయానికి రావడం, వాతావరణం అనుకూలించకపోవడం కారణంగా మంగళవారం మార్కెట్‌కు సెలవు ప్రకటించినట్లు మార్కెట్ చైర్మన్ నీలం సుహాసిని దుర్గేశ్ ఒక్క ప్రకటనలో తెలిపారు. మార్కెట్ పరిస్థితులను గమనిస్తూ రైతులు ధాన్యాన్ని విక్రయానికి తీసుకురావాలని సూచించారు.

కేసముద్రం మార్కెట్‌కు విక్రయానికి వచ్చిన ధాన్యం

